# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :91 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 08-06-2025 పేజీలు:4 వెల: 2.00


## బెంగళూరు తొక్కిసలాట ఘటన.. ట్రెండింగ్‌లో..

బెంగళూరు: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందడం యావత్ జాతిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనపై నెటిజన్లు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ తొక్కిసలాట ఘటన ఆర్‌సీబీ మెడకు చుట్టుకుంటోంది. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆర్‌సీబీ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ రు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తొక్కిసలాటకు భాద్యుడిగా కోహ్లీని అరెస్ట్ చేయాలని సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నెటిజన్లు విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు. పుష్ప-2 స్క్రీనింగ్ సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. థియేటర్‌కు టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ రావడంతోనే తొక్కిసలాట జరిగిందని, పోలీసులు వద్దని వారించినా ఆయన కారులో పరేడ్ నిర్వహించారని ఆరోపిస్తూ ఆ హీరోను అరెస్ట్ చేశారు. ఇప్పుడు కోహ్లీని చూడటానికే లక్షలాది మంది చిన్నస్వామి స్టేడియానికి వచ్చారని, ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగి 11

## బాధ్యత ఉండక్కర్లా.. ఏంటీ ఈ చిల్లర వేషాలు!



హైదరాబాద్,సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ గెలిచింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన టైటిల్ పోరులో ఆర్సీబీ సంచలన విజయం సాధించి మొదటిసారి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయంతో అభిమానుల ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. మ్యాచ్ గెలిచిన ఆనందంలో వేలాది మంది రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. ఆర్సీబీ సాధించిన విజయాన్ని తమ విజయంగా భావించారు. బాణాసంచా కాలుస్తూ సంబరాల్లో మునిగితేలారు. మెట్రో సిటీలలో అభిమానం శృతి మించింది. రోడ్లపైకి వచ్చి క్రాకర్స్ కలుస్తూ అలజడి సృష్టించారు. వాహనదారుల్ని రోడ్డుపై నిలిపివేసి ఇష్టానుసారంగా ప్రవర్తించారు. కొందరు బట్టలిప్పి నానా హంగామా చేశారు. ఆర్టీసీ బస్సులపై ఎక్కి ఆర్సీబీ జెండాలతో నినాదాలు పలికారు. ఇంకొందరు కార్లపైకి ఎక్కి రచ్చ రచ్చ చేశారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి సంఘటనలు చాలానే జరిగాయి. అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి గూండాల్లా ప్రవర్తించారు. ఏకంగా తెలంగాణ సెక్రటేరియట్ ముందు బాణాసంచా కాలుస్తూ నానా హంగామా చేశారు. బట్టలిప్పి బస్సులపై, వచ్చిపోయే లారీలపైకి ఎక్కి పైశాచిక ఆనందం పొందారు. ఆర్సీబీ చాన్నాళ్ల తర్వాత కప్ గెలవడంతో సంతోషం ఉండొచ్చు.. బట్ ఇలా శృతిమించి ప్రవర్తిస్తే అది సొసైటీకి చెడ్డ పేరు తీసుకొస్తుంది. హైదరాబాద్ లాంటి మహానగరంలో జూన్ 3 అర్ధరాత్రి జరిగిన సంఘటనలపై ఆందోళన వ్యక్తమవుతోంది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బ తీసేలా అభిమానులు ప్రవర్తించారన్న పేరు వచ్చింది. దీనిపై హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ స్పందిస్తూ.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'బెంగళూరు తొక్కిసలాట చూసినప్పుడు మనం ఎక్కడికి వెళ్తున్నామని ఆశ్చర్యం కలిగింది. ఆర్సీబీ ప్రపంచకప్ గెలవలేదు. ఆర్సీబీ జాతీయ జట్టు కాదు. బిజినెస్ పరంగా నడిచే ఓ ఐపీఎల్ ఇది. అర్ధరాత్రి 12 గంటలకు ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్‌లపైకి భారీ సంఖ్యలో యువకులు రావడం ఆందోళన కలిగించింది. వాళ్ళని అదుపుచేసేందుకు ఉన్న పోలీసులు చాలక అదనపు బలగాలను దించాల్సి వచ్చింది. పౌరులు భయం, బాధ్యత కలిగి ఉండాలి' అని సీవీ ఆనంద్ అన్నారు.

## ఎలాన్ మస్క్ సంచలన నిర్ణయం.. కొత్త పార్టీ పెట్టేందుకు ఏర్పాట్లు..?



వాషింగ్టన్, ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నాడా..? డొనాల్డ్ ట్రంప్ కు గట్టి ఝలక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాడా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అయితే, మస్క్ ఇప్పటికే కొత్త పార్టీ పెట్టేందుకు ఏర్పాట్లుసైతం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. తాజాగా.. తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో 'కొత్త రాజకీయ పార్టీని పెట్టే సమయం ఆసన్నమైందా..?' అంటూ మస్క్ పోల్ పెట్టాడు. మస్క్ పోల్‌కు నెటిజన్ల నుంచి భారీ మద్దతు లభించింది. పోల్‌లో పాల్గొన్న వారిలో 81శాతం మంది మస్క్ కొత్త పార్టీ పెట్టాలంటూ మద్దతు పలికారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ ల మధ్య విభేదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. ఇరువురు పరస్పరం సంచలన ఆరోపణలు చేసుకుంటున్నారు. తాజాగా.. మస్క్ డొనాల్డ్ ట్రంప్ పై సంచలన ఆరోపణలు చేశారు. పెద్ద బాంబు లాంటి విషయాన్ని చెప్పాల్సిన సమయం వచ్చింది. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరు ఉంది. అందుకే ఆ ఫైల్స్ వివరాలను బయటపెట్టడం లేదంటూ ఓ పోస్టు చేశాడు. బిగ్ బ్యూటీఫుల్ బిల్ వ్యవహారంలో మస్క్ తీరుతో తాను విసిగిపోయానంటూ ట్రంప్ మీడియా ముఖంగా చెప్పిన గంటలోపే మస్క్ ఈ ట్వీట్ చేయడం గమనార్హం. ఇటీవల డోజ్ శాఖ నుంచి ఎలాన్ మస్క్ వైదొలిగిన విషయం తెలిసిందే. డోజ్ శాఖ నుంచి వైదొలిగిన తరువాత నా వల్లే ట్రంప్ గెలిచారంటూ ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. ఆయన లేకున్నా గెలిచేవాడిని అంటూ ట్రంప్ కౌంటర్ ఇచ్చారు. ఇలా ట్రంప్, మస్క్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. దీంతో ట్రంప్‌కు వ్యతిరేకంగా కొత్త రాజకీయ పార్టీ ద్వారా తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించాలని మస్క్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాన్ మస్క్ పెట్టిన పోస్టుకు నెటిజన్ల నుంచి భారీ స్పందన లభిస్తుంది. కొత్తపార్టీ పెట్టాలంటూ మస్క్ కు పెద్ద సంఖ్యలో నెటిజన్లు సూచనలు చేస్తున్నారు. పోల్ కి 41లక్షలకుపైగా ఓట్లు రాగా.. ఐదు కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. పోల్ లో పాల్గొన్న వారిలో 81శాతం మంది కొత్త పార్టీ పెట్టాలంటూ మస్క్ కు మద్దతు పలికారు. 19శాతం మంది మాత్రమే కొత్త పార్టీ వద్దంటూ సూచనలు చేశారు. నెటిజన్లు కామెంట్స్ రూపంలో తమ అభిప్రాయాలు పంచుకుంటున్నారు. కొందరు లిబర్టేరియన్ పార్టీకి మద్దతు ఇవ్వాలని మస్క్ కు సూచనలు చేయగా.. అలా చేస్తే ఓట్లు చీలతాయి.. ఎప్పుడూ డెమోక్రాట్లే గెలుస్తారంటూ మరికొందరు వాదన చేస్తున్నారు. మొత్తానికి ఎలాన్ మస్క్ ఎక్స్‌లో పెట్టిన పోల్ అమెరికాలోనేకాక ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే, మస్క్ ఈ పోల్ ఆధారంగా కొత్త రాజకీయ పార్టీ పెట్టేందుకు దూకుడుగా ముందుకెళ్తాడా.. లేదంటే లిబర్టేరియన్ పార్టీకి మద్దతు ఇస్తాడా..? మళ్లీ ట్రంప్ తో కలిసిముందుకెళ్తాడా..? అనేది వేచి చూడాల్సిందే.

## అంతా నిజమే చెప్తానని ఈటల ప్రమాణం..



హైదరాబాద్,కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నేడు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కమిషన్ ముందు బహిరంగ విచారణకు హాజరయ్యారు. ఉదయం శామీర్‌పేట నివాసం నుంచి బీఆర్‌కే భవన్‌కు చేరుకున్న ఈటలను ఓపెన్ కోర్టులో కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. 20 నిమిషాల పాటు బహిరంగ విచారణలో అంతా నిజమే చెప్తానని ఈటల ప్రమాణం చేశారు. కమిషన్ ముందు 113వ సాక్షిగా ఈటల హాజరు కాగా.. బ్యారేజీ నిర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌లపైనే కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రిగా ఎంతకాలం పనిచేశారు, మేడిగడ్డ-అన్నారం-సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం చేయాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారని ఈటలను కమిషన్ అడిగింది. టెక్నికల్ టీం రిపోర్టుల ఆధారంగా సబ్ కమిటీ నిర్ణయం మేరకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, క్యాబినెట్ నిర్ణయం తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టామని ఈటల బదులిచ్చారు. తుమ్మిది హేట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని, అందుకే 150 నుంచి 148 కుదించామని చెప్పారు. రీ డిజైన్ చేయాలని ఎవరు ఆదేశించారని కమిషన్ చీఫ్ ప్రశ్నించగా.. మహారాష్ట్ర అభ్యంతరం చెప్పడంతో అప్పటి సీఎం కేసీఆర్ సబ్ కమిటీ వేశారని జవాబిచ్చారు. హరీష్ రావు చైర్మన్‌గా సబ్ కమిటీలో నేను, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నామని.. ఎక్స్‌పర్ట్ కమిటీ, టెక్నికల్ కమిటీ, సబ్ కమిటీ నిర్ణయం మేరకు రీ డిజైన్ జరిగిందని ఈటల చెప్పుకొచ్చారు. రీ డిజైన్ చేయడానికి సబ్ కమిటీ సంతకం చేసిందా? అని కమిషన్ అడగగా.. రీ డిజైన్ కోసం సబ్ కమిటీ సంతకం చేసిందని ఈటెల రాజేందర్ తెలిపారు. బ్యారేజీ నిర్మాణ ప్రదేశాలు ఎందుకు మార్చారు? అని ప్రశ్నిస్తే.. టెక్నికల్ డిటైల్స్ మీద తమకు అవగాహన ఉండదని, అంతా నిపుణులే చూసుకున్నారన్నారు. నిర్మాణ వ్యయం ఎంత అయ్యింది? అనే ప్రశ్నకు.. ముందుగా రూ.63 వేల కోట్లతో అనుకున్నామని, తర్వాత అది రూ.83 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పుడు ఎంత అయ్యిందో తనకు తెలియదన్నారు. బ్యారేజీ నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా? అని కమిషన్ అడిగితే.. ఫైనాన్స్ ఖాశాఖకు ఫుల్ డీటెయిల్స్ తెలియవని, ఇరిగేషన్ శాఖకే వివరాలు తెలిసి ఉంటుందని ఈటెల బదులిచ్చారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈటల ఆర్థిక మంత్రిగా పనిచేశారు.

## తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం..



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశం నిర్వహించనుంది. ప్రతినెల మొదటి, మూడో శనివారం కేబినెట్ మీటింగ్ జరపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలను అమలు, అభివృద్ధి పనులకు సంబంధించి ఈ సమావేశాల్లో శాఖల వారీగా సమీక్షలు నిర్వహించనున్నారు. విధానపరంగా నిర్ణయాల్లో వచ్చిన గ్యాప్‌ను ఫుల్‌ఫిల్ చేసేందుకు నెలలో రెండుసార్లు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా 17 సార్లు కేబినెట్ సమావేశాలు జరిగాయి. మరోవైపు తాజాగా నిర్వహించిన కేబినెట్ మీటింగ్‌లో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగులపై వరాల జల్లులు కురిపించాలని డిసైడ్ అయింది. రాష్ట్ర అభివృద్ధితో పాటూ ప్రజల సంక్షేమం పై దృష్టి సారించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలను ప్రకటించింది. ఇందులో ఒకటి వెంటనే ఇవ్వాలని...రెండోది ఆరు నెలల తర్వాత ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇది ప్రభుత్వ ఉద్యోగులకు కొంత ఆర్థిక ఉపశమనాన్ని కలిగించనుంది. అలాగే మహిళా స్వయం సహాయ బృందాల సభ్యులకు ప్రమాద బీమా, లోన్ బీమా చెల్లింపుల కోసం రూ. 70 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతీ నెలా ఉద్యోగులు రూ. 500 చొప్పున జమ చేస్తే...అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా జమ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వచ్చిన మొత్తాన్ని జమ చేసి ఆరోగ్య బీమా కింద మంజూరు చేస్తామని చెప్పారు. ఇక హైదరాబాద్ మెట్రో రైల్వే రెండో దశ విస్తరణపై కూడా కేబినెట్ లో సుదీర్ఘ చర్చ జరిగింది. మెట్రో సేవలను నగరంలో మరింత విస్తృతం చేయడం దానికి సంబంధించిన ప్రణాళికలపై చర్చ చేశారు. అలాగే ములుగు జిల్లా ఇంచర్లలో ఏర్పడనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి 12 ఎకరాల భూమిని కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని భట్టి చెప్పారు.

## తొక్కిసలాట ఘటన.. హైకోర్టును ఆశ్రయించిన కర్ణాటక క్రికెట్ సంఘం



బెంగళూర్ : బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో (స్టాంపేడ్) 11 మంది అభివృద్ధి చెందడం యావత్ జాతిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనపై నెటిజన్లు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్), ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో తమపై దాఖలైన కేసును సవాల్ చేస్తూ కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది (బెంగళూరు స్టాంపేడ్). కర్ణాటక హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. తమపై నమోదైన కేసును కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర విచారణ జరపాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

## 5 వేలు దాటిన కోవిడ్ కేసులు...



న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. తాజాగా కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 5 వేలు దాటింది. గత 24 గంటల్లో నాలుగు కోవిడ్ మరణాలు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంకాలతో ప్రకటించింది. నిన్న కోవిడ్ కేసుల సంఖ్య 4,866 ఉండగా.. గత 24 గంటల్లో 500 కేసులు కొత్తగా నమోదు అయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 5,364కి చేరింది. ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్‌లో కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దేశం మొత్తం మీది కేరళలోనే ఏకంగా 1, 679 కేసులు నమోదు కావడం గమనార్హం. గత 24 గంటల్లోనే అక్కడ 192 కొత్త కేసులు బయటపడ్డాయి. తాజాగా నాలుగు కోవిడ్ మరణాలు సంభవించగా.. గత 24 గంటల్లో కేరళలో ఇద్దరు మరణించారు. పంజాబ్, కర్ణాటకలో ఒకరి చొప్పున కోవిడ్‌తో మరణించారు. అయితే.. వైరస్ ప్రభావం మునుపటి స్థాయి తీవ్రతతో లేదని.. జలుబు, జ్వరం, నొప్పులతో మూడు, నాలుగు రోజుల్లో పేషెంట్లు కోలుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. అయినప్పటికీ వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఫంక్షన్‌లలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు ప్రజలకు సూచిస్తున్నారు. ఇక కేసులు పెరుగుతున్న రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో కరోనా ప్రత్యేక వార్డుల్లో పడకల సంఖ్య పెంచుతున్నారు. జులై 2024 నుంచి ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. సుమారు 73 దేశాల్లో 11 శాతం కేసుల పెరుగుదల కనిపిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అయితే కరోనా వైరస్ ఒమిక్రాన్ ఎన్బీ.1.8.1 వేరియెంట్ వైరస్ వ్యాప్తికి కారణమని డబ్ల్యూహెచ్‌వో చెబుతోంది.

## చినాబ్ బ్రిడ్జి.. ఐక్యత.. సంకల్పానికి చిహ్నం



జమ్మూ కాశ్మీర్: కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు అనుసంధానం ఇన్నాళ్లకు వాస్తవ రూపం దాల్చిందని ప్రధాని మోడీ అన్నారు. ప్రధాని మోడీ శుక్రవారం జమ్మూకాశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రపంచంలో ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇన్నాళ్లకు కాశ్మీర్ ప్రజల కల నెరవేరిందని.. ఇది ఐక్యత, సంకల్పానికి చిహ్నంగా మోడీ అభివర్ణించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్టు పూర్తి కావడం పట్ల ప్రశంసలు కురిపించారు, ఇది భారతదేశ మౌలిక సదుపాయాల ప్రయాణంలో ఒక మైలురాయిగా కొనియాడారు. అంతేకాకుండా జాతీయ ఐక్యతకు చిహ్నంగా అభివర్ణించారు. నేటి కార్యక్రమం భారతదేశ ఐక్యత మరియు సంకల్ప శక్తికి ఒక గొప్ప వేడుక అని మోడీ ప్రకటించారు. మాతా వైష్ణో దేవి ఆశీస్సులతో కాశ్మీర్ ఇప్పుడు భారతదేశపు విస్తారమైన రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించబడిందన్నారు.

### చినాబ్ రైల్వే వంతెన..

ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకితం చేశారు. రూ.46,000 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంత్రి యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టుకోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో ప్రారంభించగా 2022లో పూర్తైంది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించి విజయవంతంగా ముగించారు.

## ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ మొండి చెయ్యి...



హైదరాబాద్, జూన్ 6: నాడు ఓట్ల కోసం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ డీఏలు ఇవ్వకుండా.. పీఆర్సీ అమలు చేయకుండా మొండి చేయి చూపిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. గురువారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఐదు డీఏలకు కేవలం రెండు డీఏలనే చెల్లించాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. శనివారం ఆయన డాలస్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మరో రెండు నెలల్లో అదనంగా ఇంకో డీఏ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే ప్రభుత్వం ఇస్తున్నది ఒక్కటే డీఏ అని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పేందుకు ఉద్యోగ సంఘాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

## సంపాదకీయం

ఆదివారం 08-06-2025

# పర్యావరణ విధ్వంసం ఆగేదెప్పుడు?

ఏటా జూన్ 5న పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా... ప్రయోజనాలు, విధ్వంసాల గురించి చర్చించుకుంటున్నా మార్పు మాత్రం కానరావడం లేదు. ఈ భూమి ఏమైతే మనకేంటి అన్న ధోరణిలో పాలకులు, ప్రజలు ఉన్నారు. ప్రకృతికి మనిషే ప్రథమ శత్రువుగా మారాడు. అదే మనలను విధ్వంసం చేస్తోంది. రకరకాల జబ్బులకు కారణమవుతోంది. అయినా మనలను మనం సంస్కరించుకోలేక పోతున్నాం. దుష్పరిణామాలపై మేల్కోవడం లేదు. సంస్కరించుకుని పయనించలేక పోతున్నాం. ఏటా జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఉపన్యాసాలు ఇవ్వడం,మొక్కలు నాటడంతో పని పూర్తి చేస్తున్నాం. కానీ కార్యాచరణ కానరావడం లేదు. ప్రధానంగా ప్లాస్టిక్ భూతం కలిగిస్తున్న దుష్ఫలితాలపై చర్చించడం లేదు. ప్లాస్టిక్ మన జీవితంలో భాగంగా మారింది. దానిని బయటపడేయంతో చేతులు దులుపుకుంటున్నాం. చెట్లను పూర్తిగా నరికేశాం. అసలు అడవులను పూర్తిగా నిర్మూలించాం. కొండలను పిండి చేసి వాటి మనుగడ లేకుండా చేస్తున్నాం. పశువులను కూడా బతకనీయ కుండా మనం ఆహారంగా తీసుకుంటున్నాం. అడవుల నరికివేత వల్ల జంతువులు పూర్తిగా తగ్గిపోయాయి. కోతులు గ్రామాలపై పడి ప్రజలను రక్కుతున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. పంటల కోసం విపరీతంగా రసాయన ఎరువులు వాడేస్తున్నాం. ఇవన్నీ మనకు క్యాన్సర్ లాంటి జబ్బులకు కారణం అవుతున్నాయి. ఇవన్నీ తెలిసే జరుగుతున్న అతిపెద్ద పొరపాట్లు. అయినా మనకు జ్ఞానోదయం కలగడం లేదు. యూరోప్ దేశాల్లో ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తుంటే మనం మాత్రం విధ్వంసం సృష్టిస్తున్నాం. నదులను, చెరువులను మింగేస్తున్నాం. భారీ వర్షాలుకురిసినప్పుడు ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోయాక కానీ మనకు తెలిసి రావడం లేదు. గతేడాది బుడమేరు, ఖమ్మం ఘటనలు ఇంకా మన కళ్లముందే కదలాడుతున్నాయి. ఏటా భారీ వర్షాలు కురిసినా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు కాక తప్పడంలేదు. ఉత్తరాదిలో ముఖ్యంగా అసోం తదితరరాష్ట్రాల్లో అప్పుడే వరదలు మొదలయ్యాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారు. వరదనీరు సముద్రం పాలు కాకుండా నీటిని ఒడిసి పట్టి తరవాతి కాలంలో ఉపయోగించే ప్రణాళికలు ఇంకా రూపుదిద్దుకోవడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా ఆలోచనలు చేయక పోవడంతో ఏటా వరదల్లో ప్రజలు మునిగిపోతున్నారు. నదులు ఉప్పొంగినప్పుడు వేలాదిగ్రామాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. ఏటా కృష్ణా,గోదావరి జలాలు సముద్రం పాలు కాక తప్పడంలేదు. వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. ఎపి, తెలంగాణలో పలుప్రాంతాలతో పాటు ఉత్తరాదిలో వరదలు ముంచెత్తడం ఆనవాయితీగా మారింది. బీహార్,గుజరాత్,అసోం ,కేరళ తదితర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు, పట్టణాలు వరదనీటిలో మునిగి పోతున్నా మేల్కోవడం లేదు. వరదలు వస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రకృతి విధ్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కనిపిస్తున్నాయి. వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. భారీ వర్షాలు, వరదల వలన కలిగే నష్టాలు విషాదకరం. నదీ ప్రవాహాలను సమర్థవంతంగా నియంత్రించి నీటిని ఒడిసిపట్టే బదులు పర్యావరణ నిబంధనలను ప్రభుత్వమే ఉల్లంఘించి వరదనీటి ప్రవాహాలు అదుపు తప్పేందుకు కారణభూతమవుతోంది. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. పర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రానురాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడీతో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావరణవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. గనుల,క్వారీల తవ్వకాలు,అడవుల విధ్వంసం, పట్టణీకరణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. గతేడాది నాటి కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జలవిపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖండ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తినప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంకపర్చి చుట్టుపక్కన్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ నేటికీ ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలూ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాలు చర్చకొస్తాయి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టాలు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్‌లు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. అత్యధిక వర్షపాతం నమోదయినా నీటి సంరక్షణపై పాలకుల్లో చిత్తశుద్ది లోపించడంతో పాటు, అమలు చేయాలన్న లక్ష్యం కానరావడం లేదు. ఇటీవల ఆర్థిక నగరం ముంబయి ముంపునకు గురైంది. ఇవన్నీ పర్యావరణ విధ్వంసానికి కారణంగా చూడాలి. వీటిని నిరోధించేలా మన కార్యాచరణ ఉంటే తప్ప భవిష్యత్ ఉత్పాతాలను తట్టుకోలేమని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

# నీతి ఆయోగ్ చర్చల ప్రభావం ఎంత?



న్యూఢిల్లీ, ప్రధానమంత్రి మోడీ సమక్షంలో... ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ భేటీలో పలు అంశాలపై చర్చ జరగడం అటుంచితే..పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాలేదు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చక్కగా ఇచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించడం లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో ఏ పార్టీ అధికారం లో ఉన్నా సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగుతున్నాయి. సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగుతున్నాయి. అనేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాభం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ పదకొండేదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్ధతిలోనే సాగుతోంది. నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించారు. ఇక్కడ జరిగే చర్చలకు పెద్దగా ప్రాధాన్యం ఉండడం లేదు. ఇదే విషయాన్ని పలువురు సిఎంలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అంతెందుకు ఒకే పన్ను విధానం అంటూ తీసుకుని వచ్చిన జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవ డానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. నగదు ఉపసంహరణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

ఇవన్నీ నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చకు అవకాశం ఉండడం లేదు. మొత్తంగా పాలకులకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో శ్రద్ధ చూపడం లేదు.రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఎపి విడివడ్డ తరవాత జరిగిన ఆర్థిక విధ్వంసమే ఇందుకు కారణం. అభివృద్ధి పేరుతో చేసిన అప్పులకు నేతలను బాధ్యులుగా చేస్తే మంచిది. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. నేలవిడిచి సాము చేసే విధంగా దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించకుండా దావోస్ లాంటి వేదికలపై పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్ధికి సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీససుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమనాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదు. ఈ రంగాలకు కేటాయింపులు పెరగడం లేదు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించుకోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడమెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోం ది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడా నికి వాడుతున్నాయి.వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది.

# తేలని చర్చలు.. తీరని ఉద్రిక్తతలు

సెంట్రల్ డెస్క్:ఉక్రెయిన్ రష్యా మధ్య శాంతి చర్చలకు ఒకవంక ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవంక పరస్పరం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. టర్కీ మధ్యవర్తిత్వంలో రెండోసారి రెండు దేశాల ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు జరిగినా గంటలోనే ఎటూ తేలకుండా ముగిసిపోయాయి. కాల్పుల విరమణ ప్రసక్తి లేకుండా యుద్ధఖైదీల మార్పిడిపై మాత్రం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ చర్చలకు 24 గంటల ముందు రష్యాపై ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించాయి.అంతకు ముందు రష్యా రెండుసార్లు ఉక్రెయిన్‌పై బాంబుల వర్షం కురిపించింది. రానురాను ఈ పరస్పర దాడుల పరిణామాలు ఎంతవరకు సాగుతాయో చెప్పలేం. రోజురోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మొదటినుంచి అండదండలుగా నిలుస్తున్న ఐరోపా దేశాలు రష్యా దూకుడుపై ఆగ్రహంతో ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎంత నచ్చచెప్పినా రష్యా అధ్యక్షుడు పుతిన్ దురాక్రమణలను, దాడులను ఆపడంలేదని వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు భారీ సంఖ్యలో డ్రోన్‌లను సరఫరా చేయడానికి బ్రిటన్ సిద్ధమవుతోంది. 2026 ఏప్రిల్ నాటికి ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తామని బ్రిటన్ హామీ ఇచ్చింది. ఆ దేశానికి ఇచ్చే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఈ 350 మిలియన్ పౌండ్ల డ్రోన్ ప్యాకేజీ భాగమని పేర్కొంది.ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో ఉక్రెయిన్ తొలిసారి దాడులు మొదలు పెట్టింది. గత మూడేళ్లుగా డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని ఉక్రెయిన్ మెరుగుపర్చుకుంది. ఉక్రెయిన్ డ్రోన్ల దాడి జరుగుతుందని, అపార నష్టం సంభవిస్తుందని రష్యా ఊహించలేదు. ఈ దాడుల్లో రష్యా టియు 95, టియు 120 విమానాలు విధ్వంసం అయ్యాయి. వీటిని రష్యా తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుళ్లు ఖర్చు పెట్టవలసి వస్తుందని నిపుణులు అంచనాగా చెబుతున్నారు. రష్యా దాడులవల్ల గత మూడేళ్లలో ఉక్రెయిన్ వేలాది మంది సైన్యాన్ని కోల్పోయినప్పటికీ పాశ్చాత్య దేశాల మద్దతుతో ఉక్రెయిన్ నిలబడగలుగుతోంది. నల్లసముద్రంలో రష్యా రణతంత్ర వ్యూహాలను ఛేదించడానికి డ్రోన్‌ల వినియోగంపైనే ఉక్రెయిన్ ఆధారపడుతోంది.రష్యా అధ్యక్షుడు పుతిన్ దృష్టిలో జెలెన్‌స్కీ పిపీలికం. ఎలాగైనా జెలెన్‌స్కీని పాదాక్రాంతం చేసుకోవాలన్న కక్ష పుతిన్‌లో పోవడం లేదు. అందుకే కాల్పుల విరమణకు జెలెన్‌స్కీ అంగీకరించినా పుతిన్ ఒప్పుకోవడం లేదు. కాల్పులు విరమణ కావాలంటే అనేక షరతులను పుతిన్‌ముందుకు తీసుకు వస్తున్నారు. ఉక్రెయిన్‌లో తాము ఆక్రమించుకున్న భూభాగాలను విడిచిపెట్టాలని, నాటో కూటమిలో ఉక్రెయిన్ సభ్యత్వం పొందరాదని, భవిష్యత్తులో యుద్ధానికి సిద్ధపడబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని పుతిన్ ఆంక్షలు విధిస్తున్నారు. అసలు ప్రత్యక్షంగా తమతో చర్చలకు జెలెన్‌స్కీ సరిపోడని పుతిన్ అభిప్రాయం. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమై 40 నెలలు గడుస్తోంది.రెండు దేశాల మధ్య విసుగు, అలసట ఛాయలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. రష్యాతో పోలిస్తే ఉక్రెయిన్‌కు ఆయుధాల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. అందుకనే వినూత్నమైన డ్రోన్ దాడులను నిర్వహించడం ద్వారా తన దుర్బలత్వాలను భర్తీ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ తన



ఖేర్సన్ సిటీని కోల్పోయిన తరువాత తాను కోల్పోయిన భూభాగాల్లో 2022 నుంచి ఎలాంటి విజయాలను సాధించలేదు. గత ఏడాదిగా 5000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ రష్యా వల్ల కోల్పోయింది. ఉక్రెయిన్ ముట్టడించిన కుర్స్‌ను రష్యా తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. రష్యా స్ప్రింగ్ (వసంత) దాడి ఇప్పుడు ఊపందుకోంది.సుమీ రీజియన్‌లో భూభాగాలను ఆక్రమించుకుంటోంది. ఉక్రెయిన్ వారాంతపు రష్యా వైమానిక దాడులతో చుట్టుకుపోతోంది. దీనికితోడు సైనిక బలగాల తీవ్ర కొరత, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో మద్దతు కొనసాగడంలో అనిశ్చితి ఇవన్నీ ఉక్రెయిన్‌కు తీరని ప్రతిబంధకాలుగా వెంటాడుతున్నాయి. మరోవంక రష్యాకు కూడా తమ ఇంధన వనరులపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను నివారించడం కష్టంగా కనిపిస్తోంది. అలాగే నల్లసముద్రంలోని రష్యా దళాలపై ఉక్రెయిన్ దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేయడం రష్యాకు కలవరం కలిగిస్తోంది. రష్యా యుద్ధ రంగంలో ఏమాత్రం దూకుడు పెంచినా ఉక్రెయిన్‌నుంచి ఎదురుదాడి తప్పదు.ఇదే విధంగా యుద్ధం కొనసాగితే రెండు వైపులా అపార నష్టం తప్పదు. ట్రంప్ చొరవతో ప్రారంభమైన శాంతి చర్చలు కొద్దిపాటి పురోగతిని అందించాయి. ఈ సమయంలో ట్రంప్ తప్పుకోకూడదు. రష్యాకు చాలా కాలంగా ఫిర్యాదులు ఉన్నాయి. భవిష్యత్తు భద్రతా సమస్యలున్నాయి. ఇవన్నీ పరిష్కరించవలసి ఉంది. అయితే భవిష్యత్తులో తమపై దాడులు జరగకుండా ఉండేందుకు విశ్వసనీయమైన భద్రతా గ్యారంటీలను రష్యా నుంచి ఉక్రెయిన్ ఆకాంక్షిస్తోంది. ఈ విభేదాలను పరిష్కరించడంలోను, కాల్పుల విరమణ ఒప్పందం ఉభయ దేశాల మధ్య కుదర్చడం లోనూ కీలక సూత్రధారి అమెరికా ప్రభుత్వమే. ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య రెండో విడత చర్చలు విఫలమైన నేపథ్యంలో కనీసం ఈ నెలాఖరులోగా రెండు దేశాల అధ్యక్షులు ప్రత్యక్షంగా చర్చలు జరిపితేనే పరిష్కారం లభిస్తుందని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ చేసిన ప్రతిపాదన సమంజసమే అనిపిస్తోంది.

## పర్యావరణహితంగా హైదరాబాద్

హైదరాబాద్,హైదరాబాద్ నగరం విశ్వనగరంగా మారాలన్న తపనతో సిఎంరేవంత్ అనేక చర్యలు తీసుకుంటున్నారని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మూసీ సుందరీకరణ ఇందులో భాగమేనని అన్నారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడంతో పాటు, అందమైన నగరంగా తీర్చిదిద్దడం కూడా తమ లక్ష్యంగా ఉందని అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రతకు ప్రజలుకూడా తోడ్పాటును ఇవ్వాలన్నారు.

# భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించాలి

న్యూఢిల్లీ,గతంలో ట్రుడో ప్రభుత్వ హయంలో భారత్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో వాటిని చక్కదిద్దుకునే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. భారత్‌ను టార్గెట్ చేస్తున్న వేర్పాటువాద శక్తులతో సంబంధాలు తెంచుకోవాలని కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్ ఆ దేశంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. భారత్‌ను విభజించాలని చూసే అరాచక శక్తులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని రాజకీయ పార్టీలకు సూచించారు. కెనడాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకునే ఏ పార్టీ అయినా భారత్‌తో సమస్యలు సృష్టించిన వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోకపోతే న్యూఢిల్లీతో.. కెనడా ఎప్పటికీ స్నేహపూర్వక మైన, బలమైన సంబంధాలను కొనసాగించలేదన్నారు. వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోవడానికి ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీలు ఎందుకు ఆలస్యం చేశాయో తనకు తెలియదని హార్పర్ అన్నారు. తన పదవీకాలంలో ఇటువంటి విషయాలకు దూరంగా ఉన్నామని.. ప్రస్తుత రాజకీయ పార్టీలు కూడా అదే విధానాన్ని పాటిస్తాయని తాను భావిస్తున్నానని తెలిపారు. ఎన్నోఏళ్లుగా కెనడాకు మిత్ర దేశంగా ఉన్న భారత్‌తో తిరిగి బలమైన సంబంధాలు ఏర్పరుచుకోవాలంటే ఇప్పటివరకు కెనడాకు, భారత్‌కు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, జిహాదీలు, యాంటీ–సెమిట్‌లు, ఖలిస్థానీలు వంటి విభజన సమూహాలను ప్రోత్సహించడం ఆపాలన్నారు. ఇవి మాత్రమే ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు హార్పర్ 2006 నుంచి 2015 వరకు కెనడా ప్రధానమంత్రిగా ఉన్నారు. 1985 జూన్ 23న ఖలిస్థానీ ఉగ్రవాదులు ఎయిర్ ఇండియా విమానం కనిష్కపై బాంబు దాడి చేసిన ఘటనపై ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. రి–టైర్డ్ జస్టిస్ జాన్ మేజర్ నేతృత్వంలోని ఆ కమిషన్ జులై 16, 2010న తన నివేదికను సమర్పించింది. ఈ దాడికి దారితీసిన వైఫల్యాలకు తమ ప్రభుత్వం తరఫున అప్పట్లోనే భారత్‌కు క్షమాపణలు తెలిపారు. దశాబ్దాలతరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య గత కొంతకాలంగా సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించడంతో.. భారత్, కెనడాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. అనంతరం కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి భారత్ యత్నిస్తోందంటూ కెనడియన్ సెక్యూరిటీ– ఇంటెలిజెన్స్ సర్వీసు డిప్యూటీ డైరెక్టర్ సంచలన ప్రకటన చేశారు. దీంతో ఇరుదేశాల మధ్య దూరం మరింత పెరిగింది. కెనడా ప్రధానిగా ఉన్న మార్క్ కార్నీ ఎన్నికయిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పుడు మాజీ ప్రధాని వ్యాఖ్యలు కూడా తోడవ్వంతో సంబంధాల పునరుద్దరణలో అడుగు పడ్డట్లుగానే భావిస్తున్నారు.

## ప్రతి నిముషం దాడులపై ఆరా తీసారు

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సందర్భంలో ఆ రోజు రాత్రి ప్రధాని మోడీ నిముషనిముషానికి వివరాలు తెలుసుకుంటూ గడిపారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. అర్ధరాత్రి సమయంలో చేపట్టిన ఈ ఆపరేషన్‌ను ప్రధాని మోడీ ఎలా పర్యవేక్షించారనే విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తాజాగా వెల్లడించారు. ఇండియన్ ఆర్మీ మే 7వ తేదీ రాత్రి పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలను ధ్వంసం చేసిందని తెలిపారు. ఆ సమయంలో ప్రధాని మోదీ ప్రతి నిమిషం.. ఎక్కడ ఏం జరిగింది. ఎలా జరిగిందనే విషయాలను పర్యవేక్షించారని చెప్పారు. ఈ ఆపరేషన్ సమయంలో ప్రధాని ఎటువంటి ఒత్తిడికి లోను కాలేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణంగానే ప్రధాని మోదీ.. ఎక్కువగా రాత్రి సమయాల్లోనే పని చేస్తుంటారని చెప్పుకొచ్చారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్‌ను సైతం ఆయన రాత్రి సమయంలో పర్యవేక్షించారని తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాన మంత్రి కార్యాలయం సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. రక్షణ బలగాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఆయా బలగాలకు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఒక స్పష్టత ఏర్పడిందన్నారు. అయితే ఈ తరహా నిర్ణయం గతంలో ఎన్నడూ తీసుకోలేదని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంలో.. ప్రధాని మోదీ పక్కా స్పష్టతతో ఉన్నారన్నారు. అంతేకాకుండా.. ఈ దాడుల సమయంలో పౌరులకు ఎటు–వంటి హానీ జరగకూడదన్నది ఆయన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక పాకిస్థాన్ అణుబాంబుల పేరుతో భయపెట్టే ప్రయత్నం చేసినా.. ప్రధాని భయపడలేదన్నారు మంత్రి జితేంద్ర సింగ్. ప్రధాని మోదీ వ్యక్తిగతంగా కానీ.. దేశ భద్రత పరంగా కానీ.. ఎలాంటి భయాందోళనకు గురికాలేదన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఖచ్చితమైన టార్గెట్‌తో.. సంయమనంతో చేసిందని స్పష్టం చేశారు. ఈ దాడులు కేవలం ఉగ్రవాద స్థావరాలు, వాటి మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చేసుకుందే కానీ.. పౌరులు, ఆ దేశ సైనికులను టార్గెట్‌గా చేసుకోలేదని గుర్తు చేశారు. భారత దేశ పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో పాకిస్థాన్ డ్రోనులు, క్షిపణులతో దాడి చేసి.. పౌరులతోపాటు– సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందని వివరించారు. దీంతో భారత్ ప్రతీకార చర్యలకు దిగిందని.. పాకిస్థాన్‌లోని కీలకమైన సైనిక స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేసిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.

## మంచి ఆలోచనలే శ్రీరామరక్ష

తిరుమల, (ఆధ్యాత్మికం)చెడు వ్యసనాలు వదిలి నిర్మల మనస్సుతో ఉన్నంత కాలం మనలను ఏ మలినం ఆవరించదు. ఓ రకంగా నిర్మలమైన మనస్సు ఆరోగ్యానికి హేతువు.మన మనస్సు చేసే మంచి ఆలోచనలతోనే మన దేహం కూడా అదుపులో ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. చెడు ఆలోచనలను మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇకపోతే ఇది సత్యం. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే– వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా– చేయగలిగిందేమీ

# సింగరేణిలో ప్లాస్టిక్ వినియోగంపై సంపూర్ణ నిషేధం !



హైదరాబాద్,సింగరేణిలోని హైదరాబాద్ కార్యాలయంతో సహా అన్ని ప్రాంతాలలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ శ్రీ ఎన్. బలరామ్ సంచలనాత్మక ప్రకటన చేశారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, "ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం" అనే నినాదాన్ని స్వీకరించిన సీఎండి బలరామ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ బాటిళ్లను అస్సలు వాడకూడదని స్పష్టం చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి తన సందేశమిచ్చారు. సింగరేణి సంస్థలో ఇప్పటికే పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపడుతున్నామని, కొన్నిచోట్ల ప్లాస్టిక్ ను వాడటం మానేశారని, అయినప్పటికీ ఈ ఏడాది ఇచ్చిన ప్రపంచ పర్యావరణ నినాదాన్ని అనుసరించి సింగరేణి కార్యాలయాలు, గనులు, డిపార్ట్ మెంటులలో ప్లాస్టిక్ తో తయారుచేసిన బాటిల్స్, ప్లేట్లు, వస్తువులు తదితరాలపై ఇక సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు.సంస్థలోని అధికారులను, కార్మికులు, ఉద్యోగులు దీనికి సహకరించాలని కోరారు. తమ ఇంటి వద్ద కూడా ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని సూచించారు. పర్యావరణం పట్ల అభిమానంతో తాను ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా 19 వేల మొక్కల్ని నాటానని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని సంస్థ డైరెక్టర్లు, ఇతర కార్మికులు కూడా మొక్కలు నాటడం ప్రారంభించారని ఇది ఎంతో సంతోషకరమన్నారు.ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటాలని, అటువంటి ఆసక్తి గల వారికి సింగరేణి సంస్థ ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి ప్రాంతాల్లో ఎండాకాలం 50 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండేవని, సింగరేణి సంస్థ విస్తారంగా మొక్కలు నాటిన కారణంగా, ఆ మొక్కలు అడవులుగా పెరిగి వాతావరణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పడిపోయాయని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ కు ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గని ఉన్న అంగుల్ ప్రాంతంలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు స్థానికులు తెలియజేశారని చెప్పారు. కనుక అక్కడ కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి సింగరేణి సంస్థ సంసిద్ధమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్ ) ఎస్ డీ ఎం. సుభాని, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్ ) ఎన్.వి. రాజశేఖర్ రావు, ఇంకా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.పర్యావరణం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి ఛైర్మన్ బహుమతుల్ని అందజేశారు. అలాగే కార్యక్రమం లో పాల్గొన్న ఉద్యోగులకు జ్యూట్ బ్యాగుల్ని పంపిణీ చేశారు.

# బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌ను ప్రవేశపెట్టాలి: మాయావతి



లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి (మాయావతి) సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపును అడ్డుకునేందుకు ఈవీఎంలను తారుమారు చేశారు. అలాగే బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని మరోసారి డిమాండ్ చేశారు. లక్నోలో మీడియా సమావేశం లో మాయావతి మాట్లాడారు. 'ఈవీఎంలు నమ్మదగినవి కావు. బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే బీఎస్పీ గెలుస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ మార్పును ఆమోదించింది. ఎందుకంటే వారు ఈ వ్యవస్థ నుండి ప్రయోజనం పొందుతారు' అని.కాగా, దళితులు, అణగారిన వర్గాల్లో బీఎస్పీకి బలమైన మ ద్దతు ఉందని మాయావతి తెలిపారు. అయితే తమ పార్టీని బలహీనపరిచేం దు కు అధికార, ప్రతిపక్ష పార్టీలు క్రమపద్ధతిలో పనిచేస్తున్నాయని, కుట్రలకు పాల్ప డుతున్నాయని ఆమె వైద్యులు. కొత్త పార్టీల ఏర్పాటుతో ఈ వర్గం ప్రజలను విభజించి వారిని తప్పుదారి పట్టించడమే వారి ఏకైక లక్ష్యమని.మరోవైపు పహ ల్గామ్ ఉగ్రదాడిపై మాయావతి స్పందించారు. దేశ సరిహద్దులు సురక్షితంగా లేవని అనుకూలంగా. అందుకే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని చెప్పారు. మూలకారణాన్ని భర్తీ చేయడానికి బదులుగా, రాజకీయ పార్టీలు ఇప్పుడు పహల్గా మ్ సంఘటనను తమ ప్రయోజనం కోసం రాజకీయం చేస్తున్నాయని ఆమె ఉంది.

# తెలంగాణ సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు




న్యూఢిల్లీ, తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల సంఘం నోటీసులు జారీ చేసింది. ఇటీవల రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడి మరణంపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలంటూ నోటీసులు ఇచ్చింది. పోలీసుల టార్చర్ కారణంగా యువకుడు మరణించాడంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఎన్‌హెచ్‌ఆర్సీ పరిగణలోకి తీసుకుంది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న జాతీయ మానవ హక్కుల సంఘం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.అలాగే ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ డీజీపీకి కూడా ఎన్‌హెచ్‌ఆ ర్సీ నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని కోరింది. మీడియా కథనాల్లో విషయాలు నిజమైతే, బాధితుడి మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించినట్లుగా భావించాల్సి వస్తుందని కమిషన్ పేర్కొంది.

ఏం జరిగిందంటే

కాగా.. నగరంలోని టోలీచౌకికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు. ఈ క్రమంలో అతడు మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో.. విషయం తెలుసుకున్న రెండో భార్య నిలదీసింది. ఈ విషయంపై భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అలాగే మే 13న కూడా పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా.. అది ఎంతకీ తెగకపోవడంతో ఇరు వర్గాలు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తను లోపలికి తీసుకెళ్లిన పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇర్ఫాన్ కుప్పకూలిపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ అతడు మరణించాడు. అయితే పోలీసులు కొట్టడం వల్లే అతడు మరణించాడంటూ ఇర్ఫాన్ సోదరుడు ఆరోపించాడు. ఇర్ఫాన్‌ను తాము కొట్టలేదని పోలీసులు తెలిపారు. పోలీసుల టార్చర్ వల్లే యువకుడు మృతిచెందాడంటూ మీడియాలో కథనాలు రావడంతో ఈ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.

# 30 శాతం తగ్గిన కూటమి ఎమ్మెల్యేల ఓటు బ్యాంక్



అమరావతి, 2024 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి నాయకులు వన్ సైడ్ గా విక్టరీ సాధిస్తారని.. 150ం మించి సీట్లు గెలుచుకుంటారని.. కేకే సర్వే ప్రకటించింది. దీనిని చాలామంది కొట్టి పారేశారు. వాస్తవంలో మాత్రం అదే జరిగింది.ఎప్పుడైతే కేకే సర్వే వాస్తవ పరిస్థితి ఆధారంగా వివరాలను వెల్లడించిందో.. అప్పటినుంచి ఆ సంస్థకు క్రెడిబిలిటీ పెరిగింది. ఇదే సమయంలో ఆ సంస్థ హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ వాస్తవానికి దూరంగా వచ్చాయి. దీంతో కేకే సర్వే శాస్త్రీయత మీద జనాలకు నమ్మకం పోయింది. అయితే ఇప్పుడు ఉన్నట్టుండి కేకే సంస్థ ఒక సర్వే వివరాలను వెల్లడించింది. ఏపీలో కేకే సంస్థ ఇటీవల కాలంలో ఒక సర్వే జరిపింది. దీని వెనక ఎవరున్నారు? ఇలాంటి ప్రయత్నం ఎందుకు చేశారు? అసలు ఇప్పటికిప్పుడు సర్వే నిర్వహించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? అనే ప్రశ్నలను పక్కన పెడితే కేకే సంస్థ తను చేసిన సర్వే వివరాలను వెల్లడించింది.సరిగ్గా ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి విజయ దుందుభి మోగించింది. వైఎస్ఆర్సిపి ని కనీసం సోయిలో లేకుండా చేసింది. 11 స్థానాల వద్ద ఆగిపోయేలా చేసింది. అంత భారీ విజయం సాధించిన నేపథ్యంలో సహజంగానే కూటమి ప్రభుత్వంపై అంచనాలు ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమినేతలు ఇబ్బంది పడుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రజల్లో వస్తున్న ఆగ్రహాన్ని గమనించిన కూటమి ప్రభుత్వం నెమ్మదిగా ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇక అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో కేకే సర్వే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాలను తిరిగింది. ఈ నియోజకవర్గాలలో తమకు ఎదురైన అనుభవాలను.. ప్రజల మనోభావాలను క్రోడీకరించుకొని కీలకమైన ఫలితాలను వెల్లడించింది.కేకే సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్లో దాదాపు కూటమి ఎమ్మెల్యేల ఓటు బ్యాంకు 30% తగ్గిందని తెలుస్తోంది.. అయితే ఈ సర్వేలో ఎంతమందిని ప్రామాణికంగా తీసుకున్నారు.. వారి వయసు ఎంత.. ఏ విధమైన ప్రశ్నలు వేశారు.. శాతాన్ని ఎలా లెక్కించారు.. ఇందులో వైసిపి నాయకులకు ఎంత శాతం ప్రజల ఆమోదం ఉంది.. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకత ఎందుకు వచ్చింది.. కూటమి ఎమ్మెల్యేలు ఏమైనా అక్రమాలకు పాల్పడుతున్నారా.. ఇలాంటి విషయాలను కేకే సర్వే ప్రకటించలేదు.. దీంతో మరోసారి కేకే సర్వే పై చర్చ జరుగుతోంది. ఇదే విషయాన్ని కేకే సర్వే అధిపతి ఎదుట ప్రస్తావిస్తే ఆయన త్వరలోనే సమాధానం చెబుతానని ప్రకటించారు. మొత్తంగా చూస్తే ఈ సర్వే అంత ఆగమాగంగా.. తప్పుల తడకగా నిర్వహించినట్టు అర్థమవుతోందని కూటమి నేతలు అంటున్నారు.. ఇంకా మాకు నాలుగు సంవత్సరాలపాటు పరిపాలన కాలం ఉందని.. ప్రజల అండదండలు కూడా మాకే ఉన్నాయని కూటమి ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. ప్రజల ఆమోదం కూడా తమకే ఉందని వివరిస్తున్నారు.

# ఇక హైదరాబాద్‌లోనే రఫేల్ విడిభాగాల తయారీ..



హైదరాబాద్, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో మరో ముందడుగు పడింది. భారత వైమానిక దళానికి వెన్నెముకగా నిలుస్తున్న రఫేల్ యుద్ధ విమానాలకు సంబంధించిన విడిభాగాల ఉత్పత్తి ఇకపై భారత్‌లోనే తయారు చేయబడుతుంది. ఇందుకోసం హైదరాబాద్ కేంద్రంగా నిలవడం విశేషం. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్ (దస్సాల్ట్ ఏవియేషన్), టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) మధ్య కీలక ఒప్పందం కుదిరింది.ఇకపై రఫేల్ యుద్ధవిమానాలకు చెందిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లోని టీఏఎస్ఎల్ (టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్)లో తయారవుతాయి.

రఫేల్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు ఫ్రాన్స్ వెలుపల తయారు కావడం ఇదే తొలిసారి. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ విడిభాగాల ఉత్పత్తిని ప్రారంభించాలని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లక్ష్యంగా పెట్టుకుంది. అవసరమైన ఏర్పాట్లను సంస్థ వేగవంతం చేస్తుంది. నెలకు రెండు ఫ్యూజ్‌లేజ్‌లను అందించనుంది.భారత రక్షణ రంగ చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెట్ సీఎండీ సుకరన్ సింగ్ తెలిపారు. మరోవైపు ఈ ఒప్పందంపై డసో ఏవియేషన్ ఛైర్మన్ అండ్ సీఈఓ ఎరిక్ ట్రాపియర్ మాట్లాడుతూ.. 'భారత్‌లో మా ఉత్పత్తిని మెరుగుపరచడంలో ఇది కీలక అడుగు. భారత రక్షణ రంగంలో మా సేవలను విస్తరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ నిర్ణయం రఫేల్ విస్తరణకు మరింత సహాయం చేస్తుంది. అంతేకాదు, నాణ్యమైన సేవలను అందిస్తూ.. సైనిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

# జగన్ ని అంటుంటారే.. పవన్ చేసిందేమిటి?



అమరావతి,రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినోత్సవం నిర్వహించాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు ఇచ్చారు. ఆ పార్టీ ఆ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించింది. అలాగే.. జగన్ పాలన అంతమైన రోజు గనుక.. రాష్ట్రమంతా సంక్రాంతి దీపావళి నిర్వహించాలని పవన్ కళ్యాణ్ పిలుపు ఇచ్చారు. ఆ పార్టీ రాష్ట్రమంతా సమంగా నిర్వహించలేకపోయింది. ఆ విషయం పక్కన పెడితే.. తాము పిలుపు ఇచ్చిన ఈ కార్యక్రమాల పట్ల ఆయా పార్టీల నాయకులైనా ఎలా స్పందించారు.. అనేది కూడా గమనించాలి.వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం నిర్వహించాలని పిలుపు ఇచ్చిన తర్వాత.. పార్టీ ప్రతిచోటా స్పందించింది. పార్టీ నాయకులు పెద్దపెద్ద ర్యాలీలు తీశారు. నిరసన ప్రదర్శనలను చేపట్టారు. కలెక్టరేట్లను ముట్టడించారు. అనేక కార్యక్రమాలు జరిగాయి. వైసీపీ ప్రతినాయకుడు కూడా దాదాపుగా ఈ నిరసనల్లో పాల్గొన్నారు. కానీ.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రం ఎక్కడా కార్యక్రమాల్లో పాల్గొనలేదు. ఆయన బెంగుళూరు వెళ్లినట్టుగా వార్తలు వచ్చాయి. దీనిపై పచ్చమీడియాలో విమర్శలు కూడా వచ్చాయి. ఆయన స్వయంగా పిలుపు ఇచ్చి పాల్గొనకపోవడం ఏమిటంటూ ఆడిపోసుకున్నారు. పచ్చ దళాలకు అలవాటు అయినట్టుగా జగన్ ని అంటున్నారు సరే.. మరి సంక్రాంతి– దీపావళికి పిలుపు ఇచ్చిన పవన్ కళ్యాణ్ చేసింది మాత్రం ఏమైనా ఉందా?జనసేనాని పవన్ కళ్యాణ్ కూడా అచ్చంగా జగన్ లాగానే చేశారు. ఆయన తమ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా ఒక కార్యక్రమానికి పిలుపు ఇచ్చారు. తాను మాత్రం ఆ కార్యక్రమంలో పాల్గొనకుండా తన కార్యాలయానికి పరిమితం అయిపోయారు. తన పిలుపునకు ప్రజలు మాత్రమే స్పందించాలని ఆయన అనుకున్నారు. ఇక్కడ తేడా ఏంటంటే.. జగన్ పిలుపు ఇచ్చిన కార్యక్రమం రాష్ట్రమంతా ఘనంగా కనిపించగా.. పవన్ కార్యక్రమం మాత్రం తుస్సుమనిపోయింది.ఈ ఇద్దరు నాయకులు కూడా ఒకే పనిచేశారు. జస్ట్ ట్వీట్ చేశారు. స్వయంగా కార్యక్రమానికి నాయకత్వం వహించలేదని జగన్ మీద విమర్శలు చేయడం తప్పు కాకపోవచ్చు.. కానీ.. పవన్ కళ్యాణ్ మాత్రం చేసిందేముంది. ఆయన నాయకత్వం వహించలేదు సరికదా.. రాష్ట్రవ్యాప్తంగా ఆ కార్యక్రమం సక్సెస్ అయ్యేలా కూడా చూసుకోలేకపోయారు.పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరిహర వీరమల్లుకు సంబంధించిన టెన్షన్లలో ఉన్నారు. ప్రీరిలీజ్ వేడుక కూడా వాయిదా అంటున్నారు. అసలు వేడుక జరగదేమో అనే అనుమానం కూడా పలువురిలో ఉంది. రెమ్యునరేషన్లు తిరిగి ఇచ్చేశారని చెబుతున్నారు. ఈ టెన్షన్ల మధ్య అసలు ప్రజా కార్యక్రమం పట్ల ఆయనకు టైం లేకుండా పోయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు



బెంగళూరు, చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు చేయాలని బెంగళూరు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. మంగళవారం స్టేటస్ రిపోర్టును పరిశీలన చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. తొక్కిస్లాట ఘటనపై బెంగళూరు హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఘటనపై ప్రభుత్వానికి సంబంధించి వివరాలను అడ్వొకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. రెండున్నర లక్షల మంది స్టేడియం వద్ద చేరుకున్నారని.. తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందారని.. 56 మంది గాయాలు, 15 మంది డిశ్చార్జ్ అయ్యారని కోర్టుకు తెలిపారు. భద్రతాపరంగా అన్ని పటిష్టమైన చర్యలు చేపట్టామని ఏజే కోర్టుకు వివరించారు. ఇంతటి భారీ స్థాయి కార్యక్రమాలు జరుగుతుంటే ఎందుకు భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని కానీ ఊహించని విధంగా ఘటన జరిగిందని అడ్వొకేట్ జనరల్ తెలిపారు. తొక్కిసలాట జరిగిన సమయంలో అంబులెన్స్ లో ఉన్నాయా? అని సీజే ప్రశ్నించారు. స్టేడియం వెలుపలే అంబులెన్స్‌లు ఉన్నాయని.. అయితే లెక్కకు మించి గాయపడిన వారు ఉండటంతోనే కాస్త సమస్య వచ్చిందని ఏజే సమాధానమిచ్చారు. మెజిస్టేరియల్ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని... 15 రోజుల్లోనే ఘటనపై నివేదికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. స్టేడియంలోని 21 గేట్లు– తెరిచారా? అని కోర్టు ప్రశ్నించింది. మొత్తం గేట్లు– తెరిచామని అసలు ఎందుకు తొక్కిసలాట జరిగిందో విచారిస్తున్నామని అడ్వొకేట్ జనరల్ పేర్కొన్నారు.... ఇప్పటికే నిర్వాహకులకు నోటీ–సులు జారీ చేశామని స్పష్టం చేశారు. ప్రతి విచారణను పూర్తిస్థాయిలో వీడియో రికార్డింగ్ చేసి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. ఈ సందర్భంగా కోర్టులోని న్యాయవాది అడ్వొకేట్ జనరల్‌కు నాలుగు సూటి ప్రశ్నలు వేశారు. జరిగిన ఘటనలోని వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారని... నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరారు. క్రికెటర్లకు సన్మానం చేయాలని నిర్ణయించింది ఎవరు? ఆర్సీబీ నా లేక కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ నా... లేక రాష్ట్ర ప్రభుత్వామా...? రాష్ట్రం కోసం ఆడిన ఆటగాళ్లను సన్మానించడానికి రాష్ట్రానికి ఉన్న అర్హత ఏంటి? ఎందుకు అలా చేయాలని అనుకున్నారు? విధాన సౌధ, చిన్న స్వామి స్టేడియంలో రెండు చోట్ల కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అవసరమేంటి? రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భద్రతా పరమైన చర్యలు ఏంటి? ఈ ప్రశ్నలకు అడ్వకేట్ జనరల్ సమాధానాలు చెప్పాలని లాయర్ కోరారు. విచారణ అనంతరం వెల్లడిస్తామని సమాధానం చెప్పారు.

# కాళేశ్వరం విచారణకు కేసీఆర్ హాజరు వాయిదా.. కవిత ధర్నా వృథా !?



హైదరాబాద్,తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇందిరా పార్క్ వద్ద బుధవారం (జూన్ 4) చేపట్టిన ధర్నా వృధా అయ్యింది. అత్యంత వ్యూహాత్మకంగా కవిత చేపట్టిన ఈ ధర్నాకు ఎలాంటి మైలేజీ రాకుండా, ఆమె తండ్రి, అన్న కుట్రపన్నారా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. కేసీఆర్ గురువారం (జూన్ 5) కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరౌతారని కవిత అంతకు ఒక రోజు ముందే ధర్నాకు పిలుపునిచ్చారు. అందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసుకున్న తరువాత చివరి నిముషంలో కేసీఆర్ విచారణకు మరో రోజు హాజరౌతానంటూ కమిషన్ కు లేఖ రాయడం, అందుకు కమిషన్ అంగీకరించి 11వ తేదీన విచారణకు రావాల్సిందిగా చెప్పడం జరిగిపోయాయి. దీంతో కవిత ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నా ప్రాధాన్యత కోల్పోయింది. ధర్నాలో ఆమె కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం వెనుక.. ఆయనను రాజకీయంగా బద్నాం చేయాలన్న ఉద్దేశం ఉందని ఆరోపించారు. కొన్ని పంచ్ డైలాగులతో ప్రసంగాన్ని రక్తి కట్టించారు. కానీ కేసీఆర్ కాళేశ్వరం విచారణకు హాజరు కావడం వాయిదా పడటంతో కవిత ధర్నా వృధాగా మారిపోయింది. కవిత ధర్నాకు ఎటువంటి మైలేజీ, పొలిటికల్ ఇంపార్టెన్స్ ఉండొద్దన్న ఉద్దేశంతోనే కేసీఆర్ విచారణకు మరో రోజు వస్తానంటూ కాళేశ్వరం కమిషన్ కు లేఖ రాసి వాయిదా తీసుకున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. దీంతో కేసీఆర్ ఫొటో పెట్టుకుని కూడా బీఆర్ఎస్ ను పూర్తిగా విస్మరించి కవిత బిగ్ పొటికల్ స్టెప్ వేయడానికి నాందిగా ఇందిరా పార్క్ వద్ద చేసిన ధర్నా అనుకున్నప్రయోజనాన్ని సాధించలేకపోయారు. ఇక కవిత ధర్నాలో ఎక్కడా బీఆర్ఎస్ జెండాలు కనిపించలేదు. సరే జాగృతి బ్యానర్ పై ఆమె ధర్నా చేశారు కనుక బీఆర్ఎస్ జెండాలు లేవని అనుకుందాం.. కానీ ఈ ధర్నాలో ఎక్కడా మచ్చుకి కూడా బీఆర్ఎస్ నాయకులు కనిపించలేదు. కేసీఆర్ ఫొటోతో, కేసీఆర్ కు మద్దతుగా జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు లేకపోవడాన్ని బట్టి చూస్తుంటే.. కవితను బీఆర్ఎస్ పూర్తిగా బాయ్ కాట్ చేసిందని భావించక తప్పదు. వాస్తవానికి కవిత బీఆర్ఎస్ ను ధిక్కరించినా.. ఆమె ఇప్పటికీ పార్టీలోనే ఉన్నారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపడడానికి పోరాడుతున్న యోధురాలిగానే కవితను బీఆర్ఎస్ క్యాడర్ భావిస్తోంది. ఎందుకంటే ఆమె తన ప్రసంగాలలో కాంగ్రెస్, బీజేపీలపై సమానంగా విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ తన దేవుడని చెబుతున్నారు.అటువంటప్పుడు ఇటువంటి కార్యక్రమాలను బీఆర్ఎస్ డిస్ ఓన్ చేసుకోవడం ఎందుకన్న బాధ బీఆర్ఎస్ క్యాడర్ లో కనిపిస్తోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com